# వీడ్కోలు

## బెహరా వెంకట సుబ్బారావు


మద్రాస్ పోయే మైలు వచ్చి ఆగింది. నా సూట్ కేసునీ ఎయిర్‌బేగ్‌నీ తీసుకొని ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోకి వెళ్ళా. కండక్టర్ నా బెర్తు చూపించాడు. అది "డి" కేబిన్. నాలుగు బెర్తులున్నాయి. నాది లోవర్ బెర్తు. నా సామానుని అనువైన స్థలంలో పెట్టుకొన్నా, తర్వాత కిటికీ దగ్గర కూర్చున్నా. మరొక ముగ్గురు వచ్చి కూర్చున్నారు. అటూ యిటూ ముగ్గురం చొప్పున కూర్చున్నాం. ఆ వచ్చిన వారు ముగ్గురూ వారి మాటలను బట్టి రైల్వే వుద్యోగులని తేలి పోయింది. అది వారి స్వంత బండి. (క్షమించాలి!) వాల్తేరు రాగానే ఆ ముగ్గురూ దిగిపోయారు. మరో పాసింజరు (సుమారు అరవై సంవత్సరా లుంటాయ్) హడావిడిగా మా కేబిన్‌లోకి వచ్చాడు వాల్తేరులో. కూలీలతో హిందిలో మాట్లాడుతున్నాడు నాపైనున్న బెర్తు ఆయనకు కేటాయించ బడింది అంతకు ముందే నా కెదురుగానున్న రెండు బెర్తుల్లోనూ పాసింజర్లున్నారు పైనున్న ఆయన బెంగాలీ వారపత్రిక తిరగేస్తున్నాడు. అడుగునున్నాయన యిండియన్ ఎక్స్‌ప్రెస్ చదువు కొంటున్నాడు. ఆయన్ని చూస్తే తమిళుడులా కన్పిస్తున్నాడు. మొత్తం మీద ఆ ముగ్గురూ ఆంధ్రేతరులే కావడంతో నిరుత్సాహపడ్డా.

మా డిపార్టుమెంటువారు ట్రైనింగ్ కోసం మైసూర్ వెళ్ళమన్నారు. నా వుద్యోగపు హోదాకి ఫస్టు-క్లాసులో ప్రయాణం చేసే అర్హత వుంది. అందుకే ఫస్టుక్లాసులో పయనిస్తున్నా. వ్యక్తిగతంగా అయితే నేను సెకండుక్లాసు పాసింజర్నే! సెకండు క్లాసులో ప్రయాణం అయితేనే హాయిగా వుంటుందని )బర్త్ రిజర్వేషన్ అయితేనే సుమండీ!) నా అభిప్రాయం. అక్కడ అంతా ఫ్రీగా మాట్లాడ్తారు ఒకరినొకరు పరిచయం చేసుకొని స్నేహాన్ని పెంచుతారు' ఆనందాన్ని పంచుతారు. నవ్వుతూ నవ్విస్తూ వుంటారు ఒకరికొకరు యథాశక్తి సాయపడతారు

ఫస్టుక్లాసు ప్రయాణీకుల పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంటుంది. ఎవరిమట్టుకు వారికి సుపీరియారిటీ కాంప్లెక్స్! ముందుగా తాను కల్పించుకొని పలికరిస్తే తన ప్రిస్టేజ్‌కి భంగం వాటిల్లుతుందనీ, తన హోదాకి తగదనీ భావిస్తాడు. అందుచేతనే ఎదుటివాడు పలకరిస్తేనే గాని పెదవి విప్పడు. అదొకరకం మానసిక రుగ్మత! ఏ మాగజైనో పేపర్నో (ఇంగ్లీషుది) తిరగవేస్తూ వుంటాడు. ఏకాకిలా ప్రయాణం చేస్తాడు. నాకు మొదట్లో వారిని పలకరించాలనిపించినా (ఆ రుగ్మత నన్నూ పట్టుకొంది కాబోలు!) తర్వాత ఆ ప్రయత్నాన్ని విరమించుకొన్నా ఇదివరలో రెండుసార్లు పొందిన అనుభవాన్ని విస్మరించి మళ్లీ అదే క్లాసులో ప్రయాణం చేస్తున్నా.

వాల్తేరు స్టేషన్‌లో మెయిలు ఆగింది. కిటికీ లోంచి ప్లాట్‌ఫారం వైపు చూస్తూ కాలక్షేపం చేస్తున్నా. మా కంపార్టుమెంటు కెదురుగా సుమారు యిరవై మంది వలయంలా యేర్పడి నిలబడ్డారు. వారు తమ మధ్య చుక్కల్లో చంద్రునిలా నిలబడివున్న వ్యక్తితో స్నేహ పూర్వకంగా మధ్యలో విధేయత మిళితం చేస్తూ ముచ్చటిస్తున్నారు. ముగ్గురు వ్యక్తులు అతని మెడలో పూలమాలలు వేసారు. "ఆయన" ఒక ఆఫీసరనీ క్రింది వుద్యోగులు వీడ్కోలు యిస్తున్నారనీ ఎవరికైనా అర్థం అవుతుంది. ఆయనది నా వయసే అంటే సుమారు యాభై వుంటుంది. ఫుల్‌సూట్‌లో వున్నాడు. ట్రైన్ కదలబోతూంటే ఎక్కి గుమ్మంలో నిలబడ్డాడు. క్రిందనున్న వారు కొందరు నమస్కరిస్తున్నారు. కొందరు చేతులు వూపుతున్నారు. "ఆయన" ఏ కేబిన్‌లో వుంటారోనని తెల్సుకోవాలన్న కుతూహలం కలిగింది. చివాల్న లేచి బయటికి వెళ్లా. ఆయన నన్ను తప్పించుకొంటూ "ఇ"లోకి వెళ్లారు. ఆ "ఇ"లో రెండు బెర్తులు. మరో ఆయన వున్నాడు. తిరిగి నా కేబిన్‌లోకి వచ్చా.

మా కేబిన్ వాతావరణం ముందే చెప్పాను. అంతా మూగవారిలా కూర్చున్నారు. నేనే చొరవ తీసుకొని




పలకరించా ఆంగ్లంలో. ఎదురుగా పై బెర్తులో వున్నాయన హౌరా నుంచి వస్తున్నాడు. మద్రాసు వెళ్తున్నాడు. ఆయన బెంగాలీ. నాపైనున్న ఆయన తమిళుడు. మద్రాసే వెళ్తున్నాడు. తర్వాత నా కెదురుగా అడుగు బెర్తు ఆయన్ని పలకరించబోయా! మద్రాసు వెళ్తున్నానని అడక్కుండానే యింగ్లీషులో చెప్పాడు. భువనేశ్వర్ నుంచి వస్తున్నాడుట. తర్వాత ఎవరూ మాట్లాడ లేదు.

ట్రైన్ అనకాపల్లిలో ఆగింది. "ఇ"లో వున్నాయన కంపార్టుమెంటు దిగి ప్లాట్‌ఫారంపై పాదం మోపాడు. సుమారు పది మంది వుద్యోగులు ఆయన్ను చుట్టు ముట్టారు. ఒకడు పూల మాల వేసాడు. ఒకడు కూల్ డ్రింక్ తెచ్చి అందించాడు. ట్రైన్ బయలుదేరేవరకు వారితో ముచ్చటించి. కదుల్తున్న ట్రైన్ ఎక్కాడు.

తర్వాత స్టేషన్ తుని. మా తమ్ముని కలియడానికి నేనూ దిగాను. ఎప్పటిలాగే ఆయన ప్లాట్‌ఫారం మీద ఓ అయిదుగురితో చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడుతున్నాడు. మా తమ్మునితో మాట్లాడుతున్నా నా దృష్టంతా అతని వైపే. రైలు కదలబోతూ వుంటే యిద్దరవూ ఒకేసారి ఎక్కాం. తర్వాత సామర్లకోటలో కొంత మంది ఆయన్ని కల్సి వీడ్కోలు చెప్పారు. రాజమండ్రిలో ఆగింది ట్రైన్. మళ్లీ అదే తంతు. పదిహేను మంది వరకూ వచ్చి కల్సారాయన్ని. అరటిపళ్ళు అమ్మకానికి వచ్చాయి. డజను మూడు రూపాయలు. అరడజను తీసుకొని రెండు రూపాయల కాగితం అందించా. పళ్లవాడు జేబులు తడుముకొని చిల్లర లేదన్నాడు. ట్రైన్ కదిలింది. అర్ధ రూపాయికి బదులు మరో రెండు పళ్ళు అందించబోయాడా వ్యాపారి. చేయి చాపాను. ఆయన గేటులో అడ్డంగా నిలబడి వున్నాడు. ట్రైన్ స్పీడ్ అందుకొంది. గేటు ముందు నిలబడి వున్న ఆయనకి అందివ్వబోయాడా వ్యాపారి. అయితే ఆయన అందుకోలేదు. తనకు పట్టనట్టుగా చూస్తూ వుండి పోయాడు. చికాకేసింది. ఆయన్ని పక్కకి నెట్టి చేయి చాపా. పళ్లవాడు పరుగెత్తాడు గాని అందించలేక పోయాడు. కనీసం "సారి" అయినా చెప్పకుండా తన కేబిన్‌లోకి వెళ్లాడు ఆయన. మా కేబిన్‌లోని వారు ఎవరిమట్టుకు వారు పత్రికలో పేపర్లో చదువు కొంటున్నారు. రాజమండ్రిలో కొత్తగా యిద్దరెక్కి నా బెర్తుమీద కూర్చున్నారు. నన్ను చూడగానే సర్దుకొని కూర్చొన్నారు. కిటికీ దగ్గర కూర్చున్నా.

"బెజవాడలో దిగుతాం!" అడక్కుండానే చెప్పారు తెలుగులో. బెజవాడ వరకూ తెలుగు వారు దొరికి నందుకు సంతోషం కలిగింది. ముగ్గురవూ చాలా విషయాలు మాట్లాడుకొన్నాం. కూరగాయల ధరల దగ్గర నుంచి రాజీవ్‌గాంధి విదేశ ప్రయాణం వరకూ!

బెజవాడ చేరేసరికి రాత్రి ఏడున్నరయింది. ఆ యిద్దరూ దిగి పోయారు. నేను కూడా దిగి కాంటీన్‌లోకి వెళ్లా. అక్కడ సెల్ఫ్‌సెర్వింగ్! టిఫిన్ చేయాలంటే పెద్ద క్యూ వుంది. కాఫీ మాత్రం



తీసుకొన్నా. "ఆయన" కూడా అక్కడికి వచ్చి కేవలం కాఫీ తీసుకొన్నారు. ఇరువురవూ ఎదురుపడినా పలకరించుకో లేదు. ఆయన కనీసం "ఎక్కడి కెళ్తున్నారు?" అని అడిగినా బావుణ్ను అనిపించింది. ఆయన అడగలేదు. నేనూ మాట్లాడ లేదు. రాత్రి ఎనిమిదిన్నరకి బెజవాడ వదిలింది. పాసింజర్లు తమ తమ బెర్తుల మీద పక్కలు పర్చుకొన్నారు. నేను కూడా సర్దుకొన్నా. పక్క వేసుకొన్నా. తర్వాత ఎవరిమట్టుకు వారం మాకూడా తెచ్చుకొన్న టిఫిన్ తీసుకోడం మొదలు పెట్టాం. బెంగాలీ ఆయన రెండు రకాల స్వీట్సు మా ముగ్గురికీ యిచ్చాడు. తీసుకొన్నాం. టిఫిన్ కార్యక్రమం అరగంటలో ముగిసింది. తర్వాత అందరూ నిద్ర కుపక్రమించారు. తొమ్మిది గంటలకి తెనాలి దాటింది. అన్ని లైట్లూ ఆఫ్ చేసాం. నీలం రంగు బల్బు మాత్రం వెలుగుతోంది.

నాకు నిద్రపట్టలేదు. ఎయిర్ బేగ్‌లో వున్న ఆంధ్రప్రభ వీక్లీ తీసా. నాతల దగ్గరున్న లైట్ వెలిగించా. కొంత సేపు చదివాక నిద్ర వచ్చింది. లైట్ ఆఫ్ చేసా.

"మాష్టారూ! ఆ ప్రభ వీక్లీ ఓ సారిస్తారా?" మా కేబిన్‌లో అభ్యర్థన! తెలుగులో!! తృళ్లిపడ్డా. అశరీర వాణి మాట్లాడినట్టనిపించింది. నీలి రంగు వెల్తుర్లో ఆ ముగ్గురి వైపూ తిరిగి చూసా ఆశ్చర్యంగా.

"నేనే అడుగుతున్నా మాష్టారూ!" నా కెదురుగా క్రింది బెర్తులో వున్నాయన నోటిలోంచి వచ్చాయి ఆ మాటలు!

"మీ అసాధ్యం గూల! మీరు తెలుగు వారేనా?" తెలుగులో స్వగతంలో ఆశ్చర్యపోయి,

"మిరు ఆంధ్రులు అనుకోలేదా్సర్" అన్నా పుస్తకాన్ని అందిస్తూ.

ఆయన అప్పటికే తన తల వద్ద నున్న బెడ్ లైట్ స్విచ్ ఆన్ చేసారు. నా మాటకి జవాబుగా హుందాగా ఓ చిరునవ్వు విసిరారు అంతే గానీ ఏమీ మాట్లాడలేదు. వీక్లీ పేజీలు తిరగేస్తున్నారు. రాజమండ్రి నుంచి బెజవాడ వరకూ మేం తెలుగులో మాట్లాడు కొంటూ వుంటే, ఆయన మా మాటలు వింటూ భాష తెలీని వానిలా పెదాలు అంటించుకొని రిజర్వ్‌డుగా కూర్చున్నారు మేం జోక్సు కట్ చేసుకొని నవ్వుకొంటున్నా ఆయన కనీసం చిరునవ్వైనా చిందించలేదు నేను చేసిన కామెంట్‌కి కూడా ఆయన నుండి రెస్పాన్స్ లేదు. చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. అటువంటి ఆయనతో ముచ్చటించాలనిపించలేదు. పైగా నిద్రవస్తోంది.

★ ★ ★ ★ ★

"సార్! మరో యిరవై నిమిషాల్లో సెంట్రల్ స్టేషన్

ఇంటర్ విద్యార్థులారా!
1957 లో స్థాపించిన
రవి కళాశాల
[బ్రాడీపేట, గుంటూరు]
ఎన్నో వేలమంది
ఇంజనీర్లను, డాక్టర్లను
తయారుచేసి
ఆంధ్రుల అభిమానం
చూరగొన్న సంస్థ.
ఇపుడు ఇంటర్,
Bi.P. M.P. గ్రూపులతో
చదివే వారి కోసం
రవి
పోస్టల్
ట్యూషన్
ట్యూషన్స్, గైడ్సు
అవసరం లేకుండా
ఇంటర్ పరీక్షలలోనే గాక
ఎంట్రన్సు పరీక్షలలోకూడా
నెగ్గటానికి ఎంతో
ఉపయోగపడుతుంది.
వివరాలకు రు. 5/-లు
పంపండి.
సి. వి. ఎస్. ధన్,
డైరక్టర్.

## "వీడ్కోలు"

వస్తుంది!" తలుపు టాప్ చేసి మేల్కొలిపాడు ఎటెండరు. అందరవూ లేచాం. వారపత్రిక నా పక్కలో పడివుంది. మా సామాన్లు సర్దుకొన్నాం. అయిదున్నర గంటకల్లా సెంట్రల్లో దిగాం.

నాకు మద్రాస్ నుంచి కనెక్టింగ్ ట్రైన్ బృందావన్ ఎక్స్‌ప్రెస్. ఏడు గంటల అయిదు నిమిషాలకి బయలు దేరుతుంది. చాలా టైముంది. ప్లాట్‌ఫారం మీద ఒక కొళాయి దగ్గర కెళ్ళా. మొహం కడుక్కొన్నా. బృందావన్ బయలు దేరే ప్లాట్ ఫారం చేరుకొన్నా. చిన్న సూట్ కేసూ ఎయిర్ బేగూ నా సామాను. కాబట్టి కూలీల అవసరం లేదు. కాఫీ కోసం కాంటిన్ దగ్గరకెళ్ళా. అక్కడ నా కొలీగ్ మూర్తి కనిపించాడు. అనకాపల్లి నుంచి వస్తున్నాడు నాతో బాటు ట్రైనింగ్ కోసం. పలకరింపులూ కాఫీలూ అయాయ్.

"వెయిటింగ్ రూంకి పోదామా?" అన్నా అతని సామానుచూస్తూ. నాలాగే సింపుల్‌గా తెచ్చుకొన్నాడు.

"అక్కడికి వెళ్ళే వచ్చా! అక్కడికన్నా ఈ ప్లాట్ ఫారమే బావుంది! మరో ముప్పావు గంటేగా! ఇక్కడే కాలక్షేపం చేద్దాం!" అన్నాడు.

మూర్తి నేనూ అయిదు సంవత్సరాలపాటు ఒకే ఆఫీసులో పని చేసాం పది సంవత్సరాల క్రితం. చాలా విషయాలు ముచ్చటించుకొన్నాం. అంతలో బృందావన్ ప్లాట్ ఫారం మీద కొచ్చింది. నేనూ మూర్తి ఆ ట్రైన్ ముందు నుంచి కొస వరకు చూసాం. ఎక్కడా ఫస్ట్ క్లాస్ కంపార్ట్ కనిపించలేదు. ఆశ్చర్యం వేసింది. ఆన్‌వర్డ్ రిజర్వేషన్ బృందావన్‌కి కన్ఫర్మయిందని మా విజయ నగరంలో చెప్పారు. సీటు నెంబరు పది పేడు అని కూడా చెప్పారు. తన క్కూడా బృందావన్‌కే రిజర్వేషన్ అయిందని చెప్పాడు మూర్తి. ఆశ్చర్యం! ఆ భోగియే కనబడదు! మరో సారి తిరిగి చూసాం! 'కనిపించలేదు.... ప్రయాణికులు హడావిడిగా ట్రైన్‌లోకి పోతున్నారు. ఎవరి నడిగినా సమాధానం చెప్పరు. పైగా వాళ్ళ భాష మాకు తెలీదు. మేం అడిగిన వాళ్ళకి యింగ్లీషు వచ్చునో రాదో తెలీదు. ఏం చేయాలో తోచలేదు. ఎంక్వయరీ దగ్గరకి పోయి అడిగాం. రిజర్వేషన్ చార్టు చూసుకోమని సలహా యిచ్చాడు రిజర్వేషన్ గుమాస్తా. అతని జవాబుకి చికాకేసింది. ఈ ట్రైన్‌కి ఫస్టు క్లాసు కంపార్టుమెంటే కనబడలేదని చెప్పాం.

అతను మమ్మల్ని ఎగాదిగా చూసాడు.

"బృందావన్‌కి ఫస్టుక్లాసు వుండదనీ ఫస్టుక్లాస్ పాసింజర్లకే ఎ. సి. చెయిర్‌కార్‌లో ఎకామిడేషన్ యిస్తారనీ, ఎ. సి. చెయిర్‌కార్ చార్టు చూసుకోమనీ చెప్పాడు.

చార్టు చూసుకొన్నాం. మా పేర్లున్నాయ్. అయితే మా యిద్దరవీ చెరొక కంపార్టులో వున్నాయ్. ట్రైన్ బయలు దేరడానికి మరొక పావు గంట టైముంది. నా కంపార్టుమెంటులోకి వెళ్ళా. ఎ. సి. ఆన్ చేసివుంది. ఉదయం కావడం వల్ల బాగా చలిగా వుంది. లోపల చాలా యిరుగ్గా వుంది. రెండు చేతుల్లోనూ సామాను. ఆ యిరుకు దారిలోనే ఎదురుగా వస్తున్న పాసింజర్లను తప్పించుకొంటూ నా సీటు నెంబరు వెతుక్కుంటూ నడుస్తున్నా. క్రిందపరచి వున్న తివాచీ చెప్పుల్ని కరుచు కొంటున్నాయ్. అడుగులు త్వరగా పడటం లేదు. ఎలాగో తంటాలు పడి నా నెంబరు పట్టుకొన్నా. పక్కనే వున్న పద్దెనిమిదో నెంబరు చేర్‌లో "ఆయన" ఆ ఆఫీసరు కూర్చుని వున్నారు. సామాను సర్దుకొని నా చేర్‌లో కూర్చోబోతూ వుంటే "ఆయన" పలకరించారు.

"వాల్తేరునుంచి చూస్తున్నా! ఎక్కడి కెళ్తారు?"

"మైసూరు!" చెప్పాను పొడిగా.

కొద్ది నిమిషాలు మౌనంగా గడిచాయ్.

కంపార్టుమెంటులోని పాసింజర్లు మాట్లాడు కొంటున్నారు. కన్నడం, అరవం, యింగ్లీషూ తప్ప ఎక్కడా తెలుగు మాట వినిపించ లేదు. ట్రైనింకా బయలు దేరలేదు. ఆయన పలకరించాక కూడా మాట్లాడకుండా వుండటం సభ్యత కాదని పించింది.

"క్షమించాలి! మీ రెవరో తెల్సుకోవాలని కుతూహలంగా వుంది!" అన్నా.

తాను శ్రీకాకుళం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాల వరకు రీజినల్ ఆఫీసర్ననీ, బెంగుళూర్ ట్రాన్స్‌ఫర్ అయిందనీ, ప్రస్తుతానికి ఒక్కడినీ వెళ్తున్నాననీ చెప్పారు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. రాజమండ్రి దాటాక ఆయన ఏ స్టేషన్లోనూ దిగలేదు. ఎవరూ వచ్చి ఆయన్ని కలవ లేదు. రాజమండ్రిలో పళ్ళవాడు అరటిపండ్లు అందిస్తూ వుంటే, వాటిని తీసుకొని తోటి ప్రయాణీకునికి సహాయ పడాలనే భావం కూడా లేదాయనకు. కంపార్టుమెంటులో ఎన్నోసార్లు ఎదురైనా పలకరించుకో లేదు. ఆయన ప్రవర్తనకు తగినట్టుగానే నేనూ పలకరించ లేదు.


"ఒకరి అవసరం నాకు లేదు!" అని ఎంతటి వాడైనా ఎప్పుడూ అనుకోకూడదు!" అన్న సూక్తి తెల్సినా నేనూ అలాగే ప్రవర్తించా. మొదట్లో పలకరించాలనుకొన్నా. ఆయన పెద్ద ఆఫీసరులా కన్పిస్తున్నాడు. క్లాస కాన్షస్‌నెస్ నన్ను పలకరించనీయలేదు.

ఇప్పుడిరువురవూ పరాయి రాష్ట్రంలో పడ్డాం. తోడు వుండాలనే తహ తహ యిద్దరిలోనూ కన్పిస్తోంది. బృందావన్ కదిలింది. కంపార్టుమెంటులోకి బ్రేక్‌ఫాస్ట్ పేకట్లు వచ్చాయ్. మా వరసలో పందొమ్మిదవ నెంబరు చేర్‌లో కిటికీ దగ్గర కూర్చున్నాయన తమిళుడు. ఒక (కాగితం) పేకట్ తీసుకొన్నాడు. అందులో రెండు యిడ్లీలూ మూడు వడా అతి చిన్న సైజులో వున్నాయ్. ప్లాస్టిక్ కప్‌తో చట్నీ ప్లాస్టిక్ స్పూన్ వున్నాయ్. ఆ పేకట్ వెల మూడున్నర! వాటి క్వాలిటీ, క్వాంటిటీ, చూసాక తీసుకోవాలనిపించలేదు. "ఆయన" కూడా తీసుకో లేదు.

మరొకడు దోశలు తెచ్చాడు. ఆయన

## ధర్మపథం

# ఇరుగుపొరుగులు




మానవుడు సంఘజీవి. సంఘాన్ని విడిచిపెట్టి ఒంటరిగా జీవించడం ఎప్పుడూ సాధ్యంకాదు. ప్రతీదానికీ ఇతరులపై ఆధారపడి ఉండవలసే ఉన్నది. ఒక్క మనుష్యుయొక్క మాత్రమే కాదు; ఇతరాలయిన స్థావర జంగమాల యొక్క సహాయం అతనికి కావలసి ఉంది. అన్న వస్త్రాలూ, నివాసము మొదలైనవి మనకు ఎలా లభిస్తున్నదీ కొంచెం ఆలోచిస్తే యీ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

జీవనానికి ఇతరుల అవసరమున్నట్లే సుఖ జీవనానికి ఇరుగు పొరుగుల తోడ్పాటు అవసరమే! నిర్జన ప్రాంతంలో ఇల్లు కట్టుకొని అతడు నిర్భయంగా ఉండలేడు. ఇరుగు పొరుగుల ఇళ్లు ఉన్నప్పుడు ధైర్యం కలుగుతుంది. ఏ దిగులూ ఉండదు.

మనకు కష్టసుఖాల్లో ఆప్త బంధువులు, మిత్రులు సహాయపడుతూ వుంటారు. అది నిజమే; కాని వారు మనకు దగ్గరలో ఉండకపోవచ్చును. కాని ఇరుగు పొరుగుల నున్నవారు సన్నిహితంగా ఉంటారు. వారితోడి పరిచయం ఎక్కువగా ఉంటుంది. కష్టసుఖాల్లో వెంటనే ఆదుకునేవారు వారే! బంధుమిత్రులు రావడానికి కొంత ఆలస్యం కావడం సహజం: అందువల్ల ఇరుగుపొరుగులు అతి ప్రధానులు.

ఇరుగు పొరుగుల నున్నవారు అందరూ సత్స్వభావం కలవారే అయి ఉంటారని చెప్పలేము. అయినా, అట్టివారితో మనం అనుకూలంగానూ, స్నేహంగానూ ప్రవర్తిస్తే వారిలో మార్పు కలుగుతుంది. మనంవారి విషయంలో జోక్యం కలుగ జేసుకోకుండా వుంటే మనపై వారికి ద్వేషం ఉండదు. మనకు కష్ట సమయాల్లో సహాయం చెయ్యాలనే సంకల్పం లేకపోయినా లోకుల నిందకు జడిసి అయినా వారు సహాయపడక తప్పదు. వారికి మనపై ఇష్టం లేకపోయినా ఇలా జరగగలదు. ఒకవేళ ఇరుగు పొరుగుల వారు మనలను ద్వేషించినా, దానిని లెక్క చెయ్యకుండా మనం వారిపట్ల స్నేహభావం చూపి, కోరక పోయినా, వారికి కష్ట సమయాల్లో అండగా ఉంటే ఆ విరోధభావం అంతరించిపోతుంది.

ఇరుగు పొరుగుల సౌహార్దమును సంపాదించినయెడల ఎన్నో విధముల సౌకర్యములు కలుగును. అందువల్ల దానికయి సర్వ విధముల ప్రయత్నించుట ఉచితము.

–బులుసు వేంకట రమణయ్య

తీసుకున్నారు. రెండు దోశలూ చట్నీ! వెల మూడున్నరే! నాక్కూడా తీసుకోవాలని పించింది. ఈలోగా ఆయనే అన్నారు.

"బావున్నాయ్ వేడిగా! తీసుకోండి!" అంటూ పేకట్‌ని తీసుకొని నా కందించారు. తర్వాత కాఫీ తాగాం. ఒక్కొక్కరి బిల్లు నాలుగున్నరయింది. అయిదు రూపాయల నోటు జేబులోంచి తీసా. నాకన్నా ముందు ఆయన పది రూపాయల నోటు తీసి బేరర్‌కి అందించి వాడిచ్చిన రూపాయి తీసుకొన్నారు. అయిదు రూపాయల నోటుని ఆయన కందివ్వబోయాను. ఆయన తీసుకోలేదు.

"ఫరవాలేదు! ఉండనీయండి!" అన్నారు.

అతి బలవంతం మీద ఆ నోటుని అందుకొని తన చేతిలో వున్న ఆ రూపాయి నోటుని నాకిచ్చారు. నేను తిరిగి అర్థ రూపాయి ఆయనకి బాకీ. చిల్లర లేదు. తర్వాత యిస్తానన్నా. తర్వాత ఆయన నా ట్రైనింగ్ వివరాలు అడిగి తెల్సుకొన్నారు. తిరుగు ప్రయాణంలో బెంగుళూరులో దిగమన్నారు. టౌను చూపిస్తానన్నారు.

ఆయన విషయాలు కూడా అడిగి తెల్సుకొన్నా. వారి స్వగ్రామం అమలాపురం దగ్గర పుల్లేటికుర్రు. మగ అబ్బాయిలిద్దరూ వాల్తేరు యూనివర్సిటీలో చదువుతున్నారు. మరో నాలుగు నెలలు పోతేగానీ కుటుంబాన్ని మార్చడానికి కుదరదనీ, అంతవరకూ వంటరిగానే వుంటాననీ చెప్పారు. తనకి బెంగుళూరు కొత్త కాకపోయినా తన కోసం– స్టేషన్‌కి తన స్నేహితుడు వస్తాడని చెప్పారు.

"నేను బెంగుళూర్ కంటోన్మెంట్‌లో దిగుతా. మీరు సిటీలో దిగాలి. పావు గంట టైములో "టిప్పు" ఎక్స్‌ప్రెస్ బయలు దేరుతుంది. నాలుగున్నరకల్లా మైసూర్ చేరుకొంటారు!" డైరక్షన్ యిచ్చారు.

బంగారంపేట వెళ్లేవరకూ ఏవో కబుర్లు చెప్పుకొన్నాం. తర్వాత ఆయన పేపరు చదవడంలో నిమగ్నులయ్యారు. వారపత్రిక తీసుకొని చదవడం మొదలుపెట్టా.

ట్రైన్ కంటోన్మెంటు చేరగానే కూలీల చేత సామాను పట్టించుకొని దిగారాయన. చాలా సామానుంది. రెండు వి.ఐ.పి. సూట్ కేసులూ, రెండు ఏయిర్‌బేగులూ, హోల్డాలు, రెండు చిన్న బేగులూ. ఒకరు మానేజ్ చేసుకోవడం కష్టమే. కిటికీ దగ్గరున్న పందొమ్మిదో నెంబరు ఆయన కూడా దిగాడు. గుమ్మం దగ్గర కెళ్లి ఆయనకి టాటా చెప్పి తిరిగి వచ్చి, ఖాళీగా కిటికీ దగ్గర చేర్‌లో కూర్చున్నా. కిటికీలోంచి ఆయన కనబడుతున్నారు. సామాను దగ్గరగా వుంచుకొని వెంకటరావుగారి కోసం చూస్తున్నారు. కాలికి ఏదో తగిలితే ముందుకు వంగి చూసా. ఎయిర్‌బేగ్ కన్పించింది. అది ఆయనదే. కిటికీ అద్దంలోంచి ఆయన కనబడు తున్నారు. కానీ పిలవడానికి కుదరదు. కిటికీ ఓపెన్ చేయబడదు. అద్దం పెర్మనెంట్‌గా బిగించబడి వుంది. చివాల్న లేచా. గుమ్మం దగ్గర కెళ్లా. అప్పటికే ట్రైన్ నెమ్మదిగా కదులుతోంది. అదృష్టవశాత్తూ ఆయన మా బోగి వైపే చూస్తున్నారు. నా చేతిలో సంచి చూసి పరుగెత్తుకొని వచ్చారు. బేగ్‌ని అందుకొని థేంక్స్ చెప్పారు.

"విష్ యూ ఆల్ ది బెస్ట్!" శుభాకాంక్షలు తెలియ జేస్తూ చేయి వూపుతూ వీడ్కోలు యిచ్చారు. అప్రయత్నంగా కుడిచేతిని ఎత్తి సాల్యూట్ చేసా. ఆయన చేయి వూపుతూనే వున్నారు. కనుమరుగు అయేంతవరకూ ఆయన వైపు చూస్తూ వుండి పోయా! □